# ఇచ్చట మనుషుల్ని కొనవచ్చును

ఢిల్లీలో బోయింగ్ 737 బయల్దేరింది. ఢిల్లీలో ప్రమాదం జరిగి ఎన్నో రోజులవలేదు. అందుకని ప్రమాణీకులందరు బెల్టులు కట్టుకోమనగానే కట్టేసుకున్నారు. అందరు విమానపు సిబ్బంది ఏం చెప్తే దానికి అనుగుణంగా నడుచుకోడానికి సిద్ధంగా ఉన్నారు. మామూలుగా సగంమందికి పైగా బెల్టులు కట్టుకోరు. కాని అంతకుముందు కొద్ది రోజుల క్రితమే జరిగిన ఘోర ప్రమాదం ప్రయాణీకుల్ని బుద్ధిమంతులుగా చేసింది. ఆపైన ఆక్సిజన్ మాస్క్ ఎల్లా పని చేస్తూందో చూపించారు. శ్రద్ధగా విన్నారు. ఎయిర్ హోస్టెస్ వచ్చి యుడికొలోన్ కాయితాలు, దూది, పిప్పరమెంట్లు పంచింది. మరో ఆవిడ న్యూస్ పేపర్లు పంచింది. ఇంక వీళ్ళు భోజనం తీసుకువచ్చేవరకు కనిపించరు. టైము పన్నెండున్నర అయింది. మెడ్రాస్ చేరటానికి ఇంకా రెండు గంటలుంది.

కిటికీలోంచి బయటకు చూశాను. విమానం మేఘాలకి పైగా ఎగురుతోంది. అందుకని చూడ్డానికి ఏం లేదు. దృశ్యం సినిమాల్లో నారదుడు నడిచే దారిలా ఉంది. మళ్ళీ తలతిప్పి విమానంలోకి చూశాను. భోజనం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడే మొట్ట మొదటి సారిగ నాముందు సీట్లలోని అమెరికన్ దంపతుల్ని గమనించాను.

"ఇండియా చూడ్డానికి వచ్చారా?" అని పలకరించాను.

"అవును" అని జవాబిచ్చాడు అమెరికన్.

"ఎలా ఉంది?"

"చేరి రెండు గంటలే అయింది"

దక్షిణాది నుంచి చూడటం మొదలు పెడ్తారా?"

"అవును. మెడ్రాస్ దాకా విమానంలో వెళ్ళి అక్కడనుంచి కన్యాకుమారికి, అక్కడ నుంచి అజంతా ఎల్లోరాలకి, అక్కడనుంచి జయపూర్‌వెళ్ళి అన్నీ చూసుకుని ఢిల్లీ వెళ్తాము. ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తే దేశమంతా సరిగ్గా చూడవచ్చునని అనుకుంటున్నాం"

"బెంగుళూరు చూడరా?"

"మాకు టైము చాలదు. మా దురదృష్టం!" ఇంతలో భోజనాలు వచ్చాయి. వాళ్లు మన కారాలకి ఎల్లా తట్టుకుంటున్నారో అనిపించి చూశాను. ఈ విదేశీయులు మనదేశంలో రకరకాలుగా బాధపడ్డారు. మంచినీళ్లు తాగరు జబ్బు చేస్తుందేమో అన్నభయంతో. మన భోజనం అంతా కారాలు మిరియాలు. కారం తిని కాఫీయో టీయో తాగితే ఎక్కిళ్లు వస్తాయి. వాళ్లిద్దరు భోజనంలో చప్పటివి తిని మిగిలినవి వదిలేశారు. ఎయిర్ హోస్టెస్‌లు "ఎక్స్‌క్యూజ్ మి" అంటూ పళ్లాలు తీసేసుకుంటున్నారు.

"మీదేశంలో అందరూ ఇంగ్లీషు మాట్లాడుతున్నారేం?" అని అడిగాడు అమెరికన్.

"ఏం మాట్లాడాలో తెలియక"

"హిందీ ఉంది కదా!"

"యూరప్ అంతా ఒక దేశం అయి దానికి ఇంగ్లీషుని రాజ భాషచేస్తే ఫ్రెంచివాళ్లు జర్మన్లు ఎంత ఆదరిస్తారో ఇక్కడ హిందీకి అల్లాంటి ఆదరణే ఉంది."

"నాకు అర్థం అవుతోంది. శాసనాలవల్ల లాభంలేదు. మాకు రంగు బాధ మీకు భాష బాధ!"

ఆపైన నిక్సన్, వాటర్‌గేట్ మొదలైన విషయాలు చాలా మాటల్లో దొర్లిపోయాయి. కొద్దిక్షణాల్లో మెద్రాసులో విమానం దిగబోతోంది అంటూ ప్రకటన వినపడింది. ఆపైన విమానం క్షేమంగా విమానాశ్రయంలో దిగింది. సామాన్లు తీసుకునే చోట "దయచేసి టిప్స్ ఇవ్వవద్దు" అని వ్రాసి ఉంది. అయినా అందరూ ఇస్తూనే ఉన్నారు. కాకీ బట్టల అబ్బాయిలు చుట్టుముట్టేశారు.

"మీకు ట్రెయిన్స్‌లో రిజర్వేషన్స్ అయ్యాయా?" అని చివరి కుశలప్రశ్న వేశాను. "లేవు!" అని అమెరికన్ దంపతులు జవాబిచ్చారు.

"మీకు మా దేశంలో రైళ్ళు ఎంత కిట కిటలాడుతూ ఉంటాయో తెలియదనుకుంటాను. రిజర్వేషన్లు లేకుండా ప్రయాణం చెయ్యటం కష్టం. ఈ వేసం కాలంలో రిజర్వేషన్లు కనీసం పది రోజుల ముందైనా చేయించుకుంటేగాని దొరకవు. మీరు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఏం చేస్తారో ఏమో!" అన్నాను. నాకు వాళ్లని చూస్తుంటే జాలి వేసింది. రాజమండ్రికి వెళ్లటానికీ నేను పది రోజుల ముందరే అడిగినా నాకు బర్త్ దొరకలేదు. సీటు దొరికింది.

అమెరికన్ జవాబు చెప్పటానికి తటపటాయించాడు. ఆపైన "నిజంగా ఈ విషయం నేను మీతో అంటే మీరు నొచ్చుకుంటారేమో అని భయంగా ఉంది. కాని మనం చాలా విషయాలు ఇప్పటికే మాట్లాడుకుని దగ్గరయ్యాం కనుక మీరు మా ప్రెసిడెంటు నిక్సన్ గురించి మీ అభిప్రాయాలు సంకోచించకుండా చెప్పారుగనుక చెప్తున్నాను. మీరు బాధపడితే క్షంతవ్యుడిని. ఇక్కడ మనుష్యుల్ని కొనవచ్చునని నాకు అమెరికాలో చెప్పారు" అన్నాడు.

నాకు నిజంగా చాలాకోపం వచ్చింది. మనదేశంలో అవినీతి ఉన్నమాట నిజమే! మరీ ఇంత విచ్చల విడిగా ఉందని నమ్మలేను. పైగా ఈ అమెరికన్లు, యూరపియన్లు మూడు రోజులు చుట్టపు చూపుగా వచ్చి ఖరీదైన హోటళ్ళలో అవినీతిపరుల మధ్య ఉండి, అభిప్రాయాలు ఏర్పర్చుకుని "నేను చూసిన ఇండియా" "ఇండియాలో ఐదురోజులు" అంటూ పుస్తకాలు ప్రచురిస్తారు. అందుకే అన్నాను "మీరు టూరింగ్‌కి వచ్చిన మీ స్నేహితులు తిరిగి మీ దేశానికి వెళ్ళాక వ్రాసిన పుస్తకాలు చదివి ఉంటారు."

అతను కొంచెం నవ్వాడు. "నాకుఇండియన్ స్నేహితులు చాలా మంది ఉన్నారు. వాళ్ళ చెప్పిన విషయాలు విన్నాకే ఇండియా గొప్పదేశమని, చూద్దామని అనిపించింది. అయితే ఇక్కడ మనుష్యుల్ని కొనవచ్చునని కూడా వాళ్లే చెప్పారు. బహుశ ఇక్కడ మేము ఏదైనా ఇబ్బందైె పరిస్థితుల్లో పడితే బయట పడే మార్గం మాకు తెలియాలని చెప్పుండవచ్చును. ఏదైనా మిమ్మల్ని కావాలని నొప్పించ లేదు" అన్నాడు.

"నేను బాధపడలేదు" అన్నాను బాధగా. ఇంతలో సామాన్లు వచ్చాయి. వాళ్ళని వాళ్ల హోటలుకి టాక్సీ ఎక్కించి నేను సెంట్రల్‌స్టేషన్‌కి టాక్సీలో వెళ్ళాను.

సాయంత్రం నాలుగైంది. హౌరా మెయిల్ రాత్రి తొమ్మిదికి. అంతవరకు కాలక్షేపం చెయ్యాలి. సామాను క్లోక్‌రూమ్‌లో పడేస్తే ఏ ఇబ్బంది ఉండదు అనుకుని అటుకేసి నడిచాను. అక్కడ చాంతాడు లాంటి క్యూ ఉంది. అందులోవెళ్ళి సామాను ఇవ్వడానికి అరగంట, మళ్ళీ ఇల్లాంటి క్యూలోనే నిలబడి సామాను తెచ్చుకోడానికి అరగంట పడ్తుంది. మొత్తం గంటసేపు క్యూలో నిలబడే ఓపిక నాకు లేదు. ఇంతలో ఓ కూలీవచ్చి సామాను వెనకవేపు నుంచి కూడా తీసుకుంటారని మన సంతోషంకొద్దీ ఏమిచ్చినా పుచ్చుకుంటారని అన్నాడు.

నాకు వెనకవేపు పద్ధతులు నచ్చవు. నేను లంచం ఇవ్వను, పుచ్చుకోను. నా ఎదురుగా ఇంకోళ్ల నివ్వనివ్వను. అయితే వయస్సు పెరుగుతున్నకొద్దీ నాలోని ఆదర్శవాది నీరసించిపోతున్నాడు. ప్రస్తుతానికి నేను లంచం ఇవ్వను, పుచ్చుకోను. ఇంకోడిస్తే వాడికర్మ. ఏదిఏమైనా ఈ దేశంలో డబ్బుతో ఏ పనైనా సాధించవచ్చు అని స్నేహితులు అంటూనే ఉంటారు. నే కొన్ని సంవత్సరాలుగా వింటునే ఉన్నాను. అయితే మాత్రంమనం మన గురించి విదేశీయుల దగ్గర నీచంగా చెప్పుకోరాదని నా అభిప్రాయం. ఇల్లా చెప్పుకోడం, విదేశాల్లో భారతీయులంటే ఉన్న లోకువకి కారణం! నువ్వు యదార్థాన్ని తెలుసుకొని ఉండికూడా ఒప్పుకోలేని బలహీనతకు గురౌతున్నావ్!" అనేవాళ్ళు విదేశాల్లోని స్వదేశీయులు. కస్టమ్స్ డ్యూటీ ఎంత మందికి అన్యాయంగా వడ్డించిందో ప్రభుత్వం, చెప్పి, అదంతా కట్టకుండా వందో రెండు వందలో చేతిలోపెట్టి వాళ్ళు ఎలా బయటపడ్డారో కథలుగా చెప్పేవారు. అవినీతిని ప్రోత్సహించేవారికి విమర్శించే హక్కు లేదని నా అభిప్రాయం.

పాలవాడు పాలల్లో నీళ్లు కలిపి బియ్యంలో రాళ్లు కలిపే వర్తకుడిని విమర్శిస్తాడు.

దేశంలో ప్రతిదానికి కరువే అని ప్రభుత్వాన్ని విమర్శించే గుమస్తా రేషన్ కార్డులో అయిదుగురిని ఎక్కువ వ్రాసి చెకింగ్‌కు వచ్చిన వాడి చేతిలో డబ్బు పెడ్తాడు, ఆహార పదార్థాల కొరతవల్ల కదా రేషన్ పెట్టేది, అల్లాంటప్పుడు ఎక్కువమంది జనాభాని ప్రతికార్డులోను ప్రజలు ఇరికిస్తే ప్రభుత్వం ఏం చేస్తుంది? డబ్బు పుచ్చుకుని, వెయిటింగ్ లిస్టులో లేని ప్రయాణీకులకి సీట్లు దానం చేసే రైల్వే టికెట్ కలెక్టర్ ఇల్లుకట్టుకునేటప్పుడు అందరి చేతులు తడిపి అనుమతి పత్రాలు సంపాదించి అల్లా అందరి చేతులు తడపాల్సి వచ్చినందుకు చింతించి "ప్రపంచం పాడైపోయింది" అంటాడు దగ్గర వాళ్ళతో. మనదేశంలో అవినీతి ఒకసాధారణ విషయం అయిపోయింది. ప్రతీవాడు "నేను ఒక్కణ్ణి మానేస్తే ఏమౌతుంది? నేనొక్కణ్ణే బాధపడటం తప్ప" అంటూ అందరూ మానేసేటట్టయితే, ఇంకా వీలైతే అందరు మానేశాక మానెయ్యటానికి ఇష్టపడతాడు. ఇందులోంచి అంటే ఈ విషవలయం నుంచి బయట పడాలంటే ప్రతివాడు "నేను ఇతరులేం చేసినా అవినీతిని ప్రోత్సాహించను, ఆచరించను"అనుకోవాలి.అదే నా పద్ధతి.

ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ పక్కనుంచి హడావిడిగా ఓ పెద్ద ప్రయాణీకుల గుంపు వెళ్లింది. ఆ సామాన్లు, ఆ మెడలలో నగలు చూస్తూంటే పెళ్ళివారని తెలుస్తూనే ఉంది. పెళ్ళి హడావిడి నిజంగా చాలా సరదాగా ఉంటుంది. నిజానికి అల్లాంటి హడావిడికి నేను పది సంవత్సరాలుగా దూరంగా ఉన్నాను. ఈ సారి ఏమైనా అందులో పాలు పంచుకోవాలనే రాజమండ్రి వెళ్తున్నాను. ఆ మర్నాడు రాత్రి మా పిన్ని కొడుకుకి, మా మావయ్య కూతురితో పెళ్ళి. అందరు చుట్టాలూ వస్తారు. రేపు సరిగ్గా స్నాతకం టైముకి అందుకుంటాను. దీనికి ఎంతప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది!

ఢిల్లీలో కాన్ఫరెన్సుకని బెంగుళూరులో బయల్దేరుతున్న రోజున మావయ్య దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఫలానా రోజున పెళ్ళి అని. ఏం చెయ్యాలో తోచలేదు. పది సంవత్సరాలుగా అంటే నా పెళ్ళయ్యాక నేను మళ్ళీ ఏ పెళ్ళికి వెళ్ళలేదు. అందుకని ఈ పెళ్ళికి వెళ్ళాలన్న ఉత్సాహం ఉరకలు వేసింది. అయితే కాన్ఫరెన్సు అయ్యాక రైలెక్కితే పెళ్ళయిన మర్నాటికి రాజమండ్రి జేరతాను. ఒంటిరోజు పెళ్ళిళ్ళు జరుగుతున్న ఈ రోజుల్లో పెళ్ళయిన మర్నాడు ఎవరూ ఉండరు. అందుకని పెళ్ళికి వెళ్ళదల్చుకుంటే ఢిల్లీ నుంచి మెడ్రాసు విమానంలో వచ్చి అదేరోజు హౌరామెయిల్‌లో బయల్దేరి రాజమండ్రి వెళ్లాలి. అంటే హౌరామెయిల్‌లో రిజర్వేషన్లు నేను ఢిల్లీ వెళ్ళేటప్పుడే మెడ్రాసులో రాజమండ్రికి రిజర్వేషన్లు చేయించాను. కాలవ్యవధి లేకపోవడం వల్ల మా ఆవిడకి పిల్లలకి ఆడవాళ్ళ బెర్తులు వచ్చాయి. నాకు సీటు మాత్రం దొరికింది. ఆలోచనలు కట్టిపెట్టి టైమ్ చూసుకున్నాను. బృందావన్ వచ్చే టైమయింది. సామాన్లు చేతిలోపట్టుకుని ఆ ప్లాట్‌ఫారమ్ కేసి నడిచాను.

మా ఆవిడ పిల్లలు బృందావన్‌లోంచి దిగారు. హౌరామెయిల్ బయల్దేరటానికి ఇంకా రెండు గంటల టైముంది. కూలీ చేత సామాను నాలుగో నంబరు ప్లాట్‌ఫారమ్ మీద పెట్టించాను. రైలు ఇంకోగంటకి గాని ప్లాట్‌ఫారమ్ మీదకు రాదు. మంచినీళ్ళు పట్టి

తెచ్చుకుని, మా ఆవిడ తెచ్చిన పులిహోరా మజ్జిగన్నం అందరం తిన్నాం. మావాళ్ళ బర్త్‌లు ఆడవాళ్ళ కోటాలోవి అవటంచేత, నేను వాళ్ళదగ్గరకాక, ఆ స్లీపర్ కోచ్‌లోనే అయినప్పటికి, దూరంగా కూర్చోవాలి కనుక, నా దగ్గరున్న టికెట్లలో వాళ్ళవి వేరుచేసి మా ఆవిడకిచ్చి "జాగ్రత్త! నువ్వసలే అన్నీ పారేసుకుంటావు"అంటూ హెచ్చరించాను. ఆపైన నా టికెట్టు చొక్కాజేబులో పెట్టుకున్నాను. అదే కొంప ముంచింది. ఎప్పుడో వంగున్నప్పుడు నా టికెట్టు, నా జేబులోంచి జారిపోయింది. ఈ విషయం నేను, నా కుటుంబం రైలెక్కాక గుర్తించాను.

హౌరామెయిల్ రాగానే హడావిడిగా సామాన్లు మూడు అరల నిద్రపెట్టెలో పెట్టించేశాను. కూలీకి డబ్బు ఇచ్చాక, టికెట్టు కోసం వెతుక్కుంటే కనిపించలేదు. పొరపాటున మా ఆవిడకిచ్చానేమో అని మా ఆవిడ బాగ్ అంతా వెతికాను. లాభం లేదు. నేను టికెట్టు పారేసుకున్నాను! మా ఆవిడను "నువ్వు టికెట్టు పారేసుకుంటావ్" అని హెచ్చరించిన నేను, ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటాననుకునే నేను, పారేసుకున్నాను. నా దగ్గర రిజర్వేషన్ టికెట్టుంది. ప్రయాణం టిక్కెట్టు, ఇరవై ఒక్క రూపాయలు ఖరీదుచేసే టిక్కెట్టు పోయింది. కంపార్టుమెంటు పైన అతికించిన రిజర్వేషన్ల పట్టికలో నా పేరుకు ఎదురుగా వేసిన టిక్కెట్టు నంబరు గుర్తు వ్రాసుకున్నాను.ఆ పైన మేము అన్నాలు తిన్నచోట వెతికాము. అది కనిపించలేదు. ఎనిమిదిన్నర అయింది టైము. ఇంకో ఇరవై అయిదు నిమిషాల్లో రైలు కదులుతుంది. నేను స్టేషన్ బయటకువెళ్ళి టికెట్టుకొనాలా? వద్దా? కొంటే ఆ నంబర్, ఛార్ట్‌లో ఉన్న నంబరు ఒకటికావని టి.టి.ఇ. గొడవపెడ్తే ఏం చెయ్యడం? కొన్నాక టిక్కెట్టు కనిపిస్తే ఇరవై ఒక్కరూపాయలు దండగే! అందుకని, బుద్ధిగా రైలెక్కేసి రైలు కదిలే వరకు టి.టి.ఇ. కంట పడకుండా తలదాచుకోడమే, తక్షణ కర్తవ్యం అని నిర్ణయించుకున్నాను. ఈ రైల్లో ప్రయాణం చెయ్యకపోతే ఇంత బృహత్ప్రయత్నం వ్యర్థమైపోతుంది.

రైలు కదిలింది. టి.టి.ఇ. ఒక్కొక్కళ్ళ టిక్కెట్లే పరీక్షిస్తూ వస్తున్నాడు. నాకు భయం వేసింది. కాని మహాఅయితే ఏమౌతుంది? ఇంకో టిక్కెట్టు తీసుకోవాల్సి వస్తుంది అని ధైర్యం చెప్పుకున్నాను. నా పేరు లిస్టులో ఉందికదా ! అందుచేత గూడూరులో దింపెయ్యలేడు. అల్లాంటి పనేదైనా చేస్తే ఊరుకుంటానా ! అని సమాధానం పెట్టుకున్నాను. ఆఖరికి నా వంతు వచ్చింది. నేను పర్సులోంచి రిజర్వేషన్ టిక్కెట్టిచ్చి, ప్రయాణపు టిక్కెట్టు వెతకటం మొదలుపెట్టాను చివరి ప్రయత్నంగా. అయితే టి.టి.ఇ. పని తొందరలో ఇదేమి గమనించలేదు. అతని లిస్టులో నా పేరుకి ఎదురుగా ప్రయాణపు టికట్టు నంబరుండి రిజర్వేషన్ టిక్కెట్టు నంబరులేదు. అందుకని ఆ నంబరు వ్రాసుకుని ఇంకోళ్ళ దగ్గరకు వెళ్ళాడు. అమ్మయ్య ! బతికి పోయాను బెజవాడదాకా ఇబ్బంది లేదు.

మెల్లిగా మా ఆవిడా పిల్లలు ఉన్న వైపు వెళ్ళి ఓ దుప్పటి అడిగి తీసుకుని కిందపరుచుకున్నాను. నిద్రపట్టలేదు. కాలక్షేపానికి మంచి నీళ్ళు తాగుతుంటే నీళ్ళ సీసాలో నీళ్ళయి పోయాయి. ఇంతలో మా ఆవిడలేచి మంచి నీళ్ళు కావాలంది. అసలే వేసవి కాలం. మెయిలు అవడంచేత రైలు ఎక్కడా ఎక్కువ సేపు ఆగడంలేదు. టి.టి.ఇ. "నా దగ్గర ఉన్నాయి తీసుకోండమ్మా" అంటూ ఇచ్చాడు. మంచివాళ్ళు ప్రపంచంలో చాలామంది ఉంటారు.

బెజవాడ వచ్చింది మంచినీళ్ళు పట్టాను. పళ్ళు తోముకుని కాఫీ తాగాను. నా సీట్లో వెళ్ళికూర్చున్నాను. కొత్త టి.టి.ఇ. ఎక్కాడు. "చోటులేదు అంటూ ఎక్కడానికి ప్రయత్నిస్తున్న మనుష్యుల్ని దింపేస్తున్నాడు. చాలా స్ట్రిక్ట్‌గా ఉన్నాడే అనుకున్నాను. అందరి టిక్కెట్లు చెక్ చేసుకుంటూ నా దగ్గరకు వచ్చాడు. ఆ క్రితంరాత్రి లాగానే రిజర్వేషన్ టిక్కెట్ చేతిలో పెట్టి రెండో దానికి వెతకడం అభినయించాను "జర్నీ టిక్కెట్టు ఇవ్వండి" అన్నాడు టి.టి.ఇ. నిర్మొహమాటంగా. "పోయిందండీ" అన్నాను.

"అయితే మీరు రెట్టింపు ఛార్జీ కట్టాలి! నలభై రెండ్రూపాయలు అవుతుంది."

"నేను టిక్కెట్టు కొనకపోతే ఫైన్‌గాని కొని, పోతే రెట్టింపు ఎందుకు కట్టాలి?"

"మీరు టిక్కెట్టు కొన్నారా? లేదా? అన్నదికాదు ప్రశ్న. ప్రస్తుతం మీ దగ్గర టిక్కెట్టున్నదా? లేదా? అని"

మెద్రాసులో ఉందికదా! పాత టి.టి.ఇ. చెక్ చేశాడు కదా! పైగా మీ లిస్టులో నా టిక్కెట్టు నంబరు ఉందికదా. అందుచేత నేను అబద్ధం చెప్పడం లేదు" అంటూ ఓచిన్న అబద్ధం చెప్పాను. అత్యవసర పరిస్థితుల్లో అబద్ధాలు చెప్పవచ్చునన్నాడు శుక్రాచార్యులు.

"మీరు చెప్పినదంతా వప్పుకుంటున్నాను, కాని మీరు డబుల్ ఛార్జీ కట్టి తీరాలి.'

"నేను తప్పుచెయ్యలేదు కనుక ఫైను కట్టడం ప్రసక్తేలేదని"

"అయ్యా ! నేను తీసుకుంటే డబుల్ ఛార్జీ తీసుకోవాలి. కాకపోతే మానెయ్యాలి. నేను ఇంకోలా చెయ్యడానికి రూల్స్‌లేవు"

అయితే మీరు ఈ డబ్బు తీసుకుని టిక్కెట్టుతోపాటు, క్యాష్ రిసీట్ ఇవ్వండి నేను సి.సి.యస్ కి కంప్లైంటు చేస్తాను" అన్నాను. నేనెప్పుడైతే డబ్బుకడ్తానన్నానో పైగా కంప్లైంటు చేస్తానని బెదిరించానో టి.టి.ఇ.లో మార్పు వచ్చింది. అతను నన్ను భయపెట్టి డబ్బు గుంజుదామనుకున్నాడేమో నేను డబ్బుకట్టేస్తే అతగాడికి ఒరిగేదేమిలేదు అందుకని.

"ఏలూరు దాకా టైమిచ్చాను. వెతకండి టిక్కెట్టు కోసం"అంటూ టి.టి.ఇ ముందరకి వెళ్ళాడు.

నా ఎదురుగుండా కూర్చున్న క్రిస్టియన్ దంపతులలో భర్త నాతో మాటలు కలిపాడు.

"నిన్నరాత్రి కూడా మీరు ఒక్కటిక్కెట్టే చూపించారు" అంటూ మొదలుపెట్టాడు. నా గుండెల్లో గుళ్ళు దూరాయి. పరిశీలనా శక్తి నా ఒక్కడి సొమ్మేకాదు!

"కాని ఆ తరువాత మీరు మీ ఫామిలీ దగ్గరకు వెళ్లివచ్చి రెండో టిక్కెట్టు చూపించారు. ఆ పైన నిన్నటి టి.టి.ఇ ఆ టిక్కెట్టు తీసుకుని ముందరకు వెళ్ళాడు. అతను మీ కివ్వటం మర్చిపోయుంటాడు" అన్నాడు. క్రి.ద.భర్త పక్కనున్న అతను. క్రి.ద. భర్త పరిశీలన నన్ను ఆశ్చర్యపరిస్తే, అతని పక్కనున్న అతను తన ఇమాజినేషన్‌తో ఆశ్చర్య పరిచాడు. అతని ఊహకి స్తంభం నేను నిన్న రాత్రి టి.టి.ఇ కి టిక్కెట్టు చూపించానని అబద్ధం చెప్పటం. దానితో అతను మొత్తం దృశ్యాన్ని ఊహించుకున్నాడు. నాకు అంత బాధలోను నవ్వు వచ్చింది. అది దాచుకుని అడిగాను.

"నా టిక్కెట్టు తీసుకోపోతే ఆయనకేం లాభం?"

"కావాలని కాదు మర్చిపోయుంటాడు"

నాకు మంచినీళ్ళు కూడా ఇచ్చిన టి.టి.ఇ. మీదకు నెపం నెట్టడం నాకు అధర్మంగా తోచింది.

"నాకు గుర్తు, జాగ్రత్త తక్కువ. ఆయన టిక్కెట్టు తిరిగి ఇచ్చేఉంటాడు నేను పారేసుకుని ఉంటాను. దానికి నేను జరిమానా చెల్లించక తప్పదు."

"అతని చేతిలో ఏదైనా పెట్టండి. అనవసరంగా నలభై రూపాయలెందుకు కడ్తారు." అన్నాడు క్రి.ద.భర్త.

"కట్టినా అది మళ్ళీ నాకు వస్తుంది కదా?"

"వస్తుందనుకోండి. కాని మీరు చాలా రోజులు వెయిట్‌చెయ్యాలి. అంతకంటే, మీరు రిజిస్ట్రేషన్‌కి వాటికి పెట్టే పోస్టల్ ఛార్జెస్ అతని చేతిలోనే పెట్టవచ్చుకదా."

"నా అంత మంచివాడికి లంచం ఇస్తారా? అని ఎదురు తిరిగి టి.టి.ఇ నన్ను డబ్బాయిస్తే."

"అలా చెయ్యడు. ఈ దేశంలో డబ్బిస్తే వద్దనేవాడు ఎవడూ లేడు."

"ఎంతిమ్మంటారు?"

"రెండుమీద అయిదు లోపల ఇవ్వవచ్చును అయిదిస్తే మీరేం చెప్తే అది చేస్తాడు".

అయిదు రూపాయలకి టి.టి.ఇ.ని కొనడానికి నిశ్చయం చేసుకున్నాను. ఏలూరు వచ్చింది. నేను వెళ్ళి టి.టి.ఇ. తో నా టిక్కెట్టు నిజంగా పోయిందని అందుకని అతను నాకు సహాయం చెయ్యాలని కోరాను "అల్లాగే మనం, మనం, ఎడ్జెస్టు అవుదాం" అని నాతో అని, బెజవాడలో తను వద్దంటున్నా ఎక్కిన ప్రయాణీకుల దగ్గర రెండేసి రూపాయలు వసూలు చెయ్యటం మొదలు పెట్టాడు.

రైలు నిడదవోలు దాటింది.నేను టి.టి.ఇ. చేతిలో అయిదు రూపాయలు పెట్టాను. టి.టి.ఇ రాజమండ్రి స్టేషనులో గేటుదాకావచ్చి నాకు వీడ్కోలు ఇచ్చాడు. జీవితంలో మొదటిసారి అవినీతి పని చెయ్యడం వల్ల పుట్టిన చమటను తుడుచుకుంటూ టాక్సీలో ఎక్కాను. "మీరు ప్రభుత్వాన్ని మోసగించలేదు. మీరు టిక్కెట్టు కొనకుండా, టి.టి.ఇ. చేతిలో డబ్బుపెట్టి ఉంటే మీరు బాధపడటంలో అర్థం ఉంది. మీరు ఇప్పుడు చేసింది దానం. ఒక బీద టి.టి.ఇ. కి అయిదు రూపాయలు దానం చేశాననుకోండి" అంది మా ఆవిడ సానుభూతితో. మొదటి సారి తప్పు చేసిన బాధ అనుభవించాల్సిందే కాని మాటలతో చెప్తే అర్థమయ్యేది కాదు.

నేను తప్పు చేశాను అన్న బాధకంటే ఆమెరికన్ అన్నట్టు మనదేశంలో మనుషుల్ని కొనవచ్చుననే భయంకర సత్యం నన్నింకా బాధ పెట్టింది. ●

(ఆంధ్రసచిత్ర వారపత్రిక నవింబర్1973)